రహదారి భద్రతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రహదారి భద్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆర్‌టిసి కాంప్లెక్స్ స్టేషన్ మేనేజర్ వి.శామ్యూల్ అన్నారు. ఆర్‌టిసి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాల్లో భాగంగా నగరంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగాన్ని నియంత్రించడం ద్వారా వందేళ్ల జీవనాన్ని పొందాలన్నారు. వాహనదారులు తప్పక హెల్మెట్లు ధరించాలని సూచించారు. ప్రయాణికులు వాహనం ఆగినప్పుడే ఎక్కడం, దిగడం ద్వారా ప్రమాదాలు సంభవించవని అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్ అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఎస్ నాయుడు, 1, 2 డిపోల కార్మికులు, గ్యారేజ్ కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

'చేదోడు' ఎందరికి..?

- దరఖాస్తుకు గడువు కుదింపు
- ప్రచారం లేక పథకానికి లబ్ధిదారులు దూరం

చేతివృత్తిదారులకు ఆర్థిక చేయూతను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'జగనన్న చేదోడు' పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ ఏడాది గడువును కుదించారు. సాధారణంగా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు కనీస గడువు 20 రోజులు ఇస్తుంటే, ఈ పథకానికి ఈసారి కొత్తవారు దరఖాస్తు చేసుకునేందుకు కేవలం రెండు రోజులే ఇచ్చారు. పాత లబ్ధిదారులు నవీకరించుకునేందుకు ఐదు రోజుల గడువే ఇవ్వడంతో లబ్ధిదారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ పథకం నమోదుపై ప్రచారం కూడా లేకపోవడం, దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఇవ్వకపోవడంతో, అర్హులైన అనేకమందికి లబ్ధి అందకుండా పోతోంది. లబ్ధిదారుల సంఖ్యను ఈ ఏడాది కుదించేందుకే ప్రభుత్వం ఈ విధంగా చేసిందని లబ్ధిదారుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నౌపడ : చేదోడు వివరాలను నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో వెనుకబడిన తరగతుల్లో ఎక్కువ మంది కుల వృత్తుల పైనే ఆధారపడి జీవిస్తున్నారు. వారికి సాయం చేసే దిశగా ప్రభుత్వం జగనన్న చేదోడు పథకాన్ని ప్రవేశపెట్టింది. రజకులు, నాయీబ్రాహ్మణులు, దర్జీలు తదితరులకు ఆర్థిక సాయం అందించేందుకు రెండేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఆయా వృత్తులు చేసుకునే వారికి ఏడాదికి రూ.పది వేల చొప్పున సాయాన్ని అందిస్తున్నారు. తెలుపు రంగు రేషన్ కార్డు కలిగి 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు ఈ పథకానికి అర్హులు. అర్హులైన వారు బియ్యం కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, లేబర్ సర్టిఫికేట్‌తో పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. ఆయా అర్హతలు కలిగిన వారిని లబ్ధిదారులుగా సచివాలయ వాలంటీర్లు గుర్తిస్తే, వారి పత్రాలను సచివాలయాల్లోని సంక్షేమ అసిస్టెంట్లు నవశకం బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఎంపిడిఒ లాగిన్ నుంచి సదరు జాబితాను పరిశీలించి జిల్లా అధికారులకు, అక్కడి నుంచి రాష్ట్రస్థాయి అధికారులకు పంపుతారు. అనంతరం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేస్తారు. ఈ ప్రక్రియ మొదటి, రెండో విడత సజావుగానే సాగింది. దీంతో లబ్ధిదారులు ఎవరూ పెద్దగా ఇబ్బందులు పడలేదు.

మూడో విడత దగ్గరకొచ్చేసరికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అంతా గందరగోళంగా సాగింది. ఈనెల 23వ తేదీన రాష్ట్ర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాల్లో 25వ తేదీ లోగా కొత్త, పాత దరఖాస్తుదారుల బయోమెట్రిక్, కుల, ఆదాయ, లేబర్ ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. 26న ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్లు వాటి పరిశీలన అనంతరం కార్పొరేషన్ ఇడి లాగిన్‌కు, తర్వాత జిల్లా కమిటీ ఆమోదం ద్వారా ప్రభుత్వానికి పంపాలని సూచించారు. 27న సాయంత్రం ఐదు గంటల్లోగా వివరాలు, ధ్రువీకరణ పత్రాలను నమోదు చేసిన వారికే ఈనెల 30వ తేదీన లబ్ధిని అందించనున్నారు. మరోవైపు పథకంలోని లబ్ధిదారులను తగ్గించాలన్న లక్ష్యంతో ఈ విడత సరికొత్త నిబంధనలను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. గతంలో బియ్యం కార్డుతో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించగా... ఈ ఏడాది బియ్యం కార్డుకు బదులుగా ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని నిబంధన తీసుకొచ్చింది. గతంలో మీసేవ, ఈసేవ కేంద్రాల నుంచి తీసుకున్న లేబర్ సర్టిఫికేట్లను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఈ ఏడాది మాత్రం సచివాలయాల వద్ద మాత్రమే తీసుకోవాలనే షరతు పెట్టింది. దరఖాస్తు, నవీకరణ చేసుకోవడానికి ప్రతిఒక్కరూ తప్పనిసరిగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందేందుకు కనీసం ఐదు నుంచి పది రోజుల సమయం పడుతుంది. ప్రభుత్వం ఇచ్చిన గడువు ఐదు రోజులే కావడంతో సగానికి పైగా లబ్ధిదారులు పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోయారు. పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నా, తహశీల్దార్ కార్యాలయాల వద్ద పేదలు ఎదురుచూడడం కనిపిస్తోంది. రెవెన్యూ శాఖలో వారికి ఉన్న పని ఒత్తిడి కారణంగా ఈ ధ్రువీకరణ పత్రాలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే గడువు ముగిసిపోయిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హుల ఇళ్లకు వెళ్లి సంబంధిత పత్రాలు తీసుకుని సచివాలయంలో అప్‌లోడ్ చేయించాల్సిన బాధ్యత వాలంటీర్లదేనని అధికారులు మెసేజ్‌లు పంపించారు. అయినా చాలామంది పట్టించుకోకపోవడంతో దరఖాస్తుదారులే తహశీల్దార్ కార్యాలయం, సచివాలయాల చుట్టూ తిరిగారు. చాలామందికి దరఖాస్తు చేసుకోవాలని, ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలనే విషయమే తెలియదు.

2020-21లో ఈ పథకం కింద 31,408 మందికి రూ.31.40 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. 2021-22లో 15,089 మందినే అర్హులుగా గుర్తించి రూ.15.09 కోట్లకు కుదించింది. గతేడాది ఈ పథకం కింద జిల్లాలో 6,654 మంది రజక లబ్ధిదారులు, 3175 మంది నాయీబ్రాహ్మణులు, 5566 మంది దర్జీ లబ్ధిదారులకు మొత్తం 15,089 మంది లబ్ధిదారులకు రూ.15.09 కోట్ల జమ అయింది. నియోజకవర్గాల వారీగా చూస్తే ఆమదాలవలస నియోజకవర్గంలో 1850 మంది, ఎచ్చెర్ల నియోజకవర్గంలో 1913 మంది, ఇచ్ఛాపురంలో 1194 మంది, నరసన్నపేటలో 1807 మంది, పాలకొండలో 1091 మంది, పలాసలో 1002 మంది, పాతపట్నంలో 1418 మంది, రాజాం లో 1622 మంది, శ్రీకాకుళంలో 1978 మంది, టెక్కలి లో 1214 మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఈ ఏడాది లబ్ధిదారుల సంఖ్య మరింత పెరగాల్సి ఉండగా, కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో లబ్ధిదారుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

6న చలో కలెక్టరేట్

- అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి
- 12, 13న యూనియన్ జిల్లా మహాసభలు
- అంగన్వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సుధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 6వ తేదీన చలో కలెక్టరేట్‌ను చేపడుతున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేవని, కొన్ని కేంద్రాలకు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. టిఎ, డిఎలు ఐదేళ్లుగా ప్రభుత్వం చెల్లించడం లేదని చెప్పారు. రకరకాల యాప్‌లను తీసుకొచ్చి అంగన్వాడీలకు పనిభారం పెంచినా, వేతనాలు పెంచలేదని విమర్శించారు. అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదని, మరోవైపు ఫేస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణ పోషణ పథకం మెనూకు తగిన విధంగా ఛార్జీలు ఇవ్వడం లేదని, సరుకుల పరిమాణం పెంచలేదన్నారు. గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సచివాలయాల పర్యవేక్షణలో చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుధ

ఇప్పటికే ఐసిడిఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారని గుర్తుచేశారు. ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె, తహశీల్దార్, ఎంపిడిఒ, రాజకీయ నాయకులు ఇలా అనేక మంది విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్వాడీలపై పనిభారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి నిధులు పెంచి, అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్‌వైజర్ పోస్టుల్లో వయోపరిమితి తొలగించాలని, ప్రమోషన్లో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. మినీ సెంటర్‌లోని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకోవాలని, అదనంగా హెల్పర్‌ను ఇవ్వాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు పరిమాణాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వమే గ్యాస్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

12, 13న యూనియన్ జిల్లా మహాసభలు

ఫిబ్రవరి 12, 13 తేదీల్లో అంగన్వాడీ యూనియన్ జిల్లా మహాసభలను పలాసలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12న ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ర్యాలీ, బహిరంగ సభకు అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొని జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ నాయకులు బి.ఆదిలక్ష్మి, శాంతామణి, బి.సింహాచలం, కె.సుజాత, ఎన్.హేమవతి, ఎ.హేమలత, ఎం.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం దువ్వాడ ఏం చేశారు?

ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - టెక్కలి, టెక్కలి రూరల్

నిజంగా దువ్వాడకి టెక్కలి నియోజకవర్గ ప్రజలపై గౌరవం, నమ్మకం ఉంటే అధికారం చేపట్టిన మూడేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా? అని టిడిపి టెక్కలి, నందిగాం మండలాల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్ ప్రశ్నించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విధ్వంసమే తప్ప, అభివృద్ధి ఉందా? అని వారు ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోసం ఏమి చేశారో చెప్పాలన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడలేని దువ్వాడ ప్రజాబలం కలిగిన నాయకునిపై విమర్శలు చేయడం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. వ్యక్తిగత విమర్శలు మాని ప్రజా సమస్యలపై మాట్లాడితే బాగుంటుందని హితవుపలికారు. దువ్వాడ శ్రీనివాస్ ఓటమికి బ్రాండ్ అంబాసిడర్ అని, కింజరాపు అచ్చెన్నాయుడుపై అవాకులు చవాకులు మాట్లాడుతూ నోరు పారేసుకోవడం దువ్వాడకు పరిపాటి అని అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు చాపర గణపతి, హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, రెయ్యి ప్రీతీష్ చంద్, పోలాకి షణ్ముఖరావు, మెండ దమయంతి, పోలాకి చంద్రశేఖర్, కోళ్ల కామేష్, మల్లా బాలకృష్ణ, వసంతరావు, మల్లిపెద్ది మధు, దల్లి ప్రసాద్‌రెడ్డి, బగాది సునీల్, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడపై టిడిపి నేతల ఫిర్యాదు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన దువ్వాడ శ్రీనివాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి టెక్కలి, నందిగాం మండలాల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్ ఆదివారం టెక్కలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని ఎస్ఐ ఎల్.రామకృష్ణకు అందించారు. అచ్చెన్నాయుడుపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ అసభ్యకర పదజాలంతో దూషిస్తు, దుర్భాషలాడారని, నియోజకవర్గానికి వస్తే కొడతానని, చంపుతానని బెదిరించారని తెలిపారు. మానసికంగా మనోభావాల్ని దెబ్బతీసే దువ్వాడ వ్యాఖ్యలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్, వాణి

అచ్చెన్నపై దువ్వాడ ఫిర్యాదు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

చిత్తూరు జిల్లా కుప్పం బహిరంగ సభలో కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసిపి నేతలపై వ్యక్తిగత దూషణలు చేయడంపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళి, ఎస్ఐ రామకృష్ణకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చెన్న 'ఒరే జగన్' అని సంబోధించి వైసిపి నాయకులు, కార్యకర్తలను బండ బూతులు తిట్టారని అన్నారు. ప్రజలను సిఎం పాలనపై తిరుగుబాటు చేయాలని చెప్పడం, రాష్ట్రంలో అశాంతి వాతావరణం కల్పించేలా మాట్లాడటం తగదని అన్నారు. తాము అధికారంలోకి వస్తే వైసిపి నాయకుల తొక్కి నార తీస్తామని బెదిరించడం, పోలీసు సిబ్బందిపై వ్యాఖ్యలు చేశారని చెప్పారు. అచ్చెన్నపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎంపిపి అట్లా సరోజనమ్మ, శిగిలిపల్లి మోహన్‌రావు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను ఎవరు గుర్తిస్తారు?

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేస్తున్న పాదయాత్రను ఎవరు గుర్తిస్తారని, ఆయన కంటే కింజరాపు అచ్చెన్నాయుడు చేస్తే మరో ఐదారుగురు ఎక్కువ మంది వచ్చే వారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. కుటుంబసమేతంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం దర్శించుకున్నారు.

స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనివెట్టి మండపంలో స్వామి వారి చిత్రపటాన్ని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర వల్ల ఆయన ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. అచ్చెన్నాయుడు పోలీసులపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు పరిమితి మేరకు మాట్లాడాలని హితవు పలికారు. మంత్రి వెంట ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్, కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ప్రత్యేక కలెక్టర్ జి.జయదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ, సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త ఆర్.జయప్రకాష్ తదితరులున్నారు.

టిబి రోగులకు మెరుగైన వైద్యం

- 12 యూనిట్ల ద్వారా సేవలు
- జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ అనురాధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్షయ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టరు ఎన్.అనురాధ స్పష్టం చేశారు. వ్యాధిగ్రస్తులు కెల్ల పరీక్షలు చేయించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యాధి విస్తరిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 1640 మంది రోగులను గుర్తించి మందులు అందిస్తున్నాం. మందులు సక్రమంగా వినియోగిస్తే వ్యాధి తప్పక నయమవుతుంది. జిల్లా క్షయవిస్తరణ, నివారణకు చేపడుతున్న చర్యలు, వారికి అందిస్తున్న సౌకర్యాలను ఆమె ప్రజాశక్తికి ముఖాముఖిలో వివరించారు.

జిల్లాలో క్షయ నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి వ్యవసాయ కూలీలుగా, భవన నిర్మాణ కార్మికులుగా, అసంఘటితరంగాల్లో, పరిశ్రమల్లో పని చేస్తున్నారు. అటువంటి వారు వివాహేతర సంబంధాలు, మత్తు పదార్థాల వాడకం వంటి వ్యసనాలవల్ల అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. అలా వ్యసనాలకు బానిసై ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. వ్యాధిగ్రస్తులు సొంత ఊళ్లకు చేరిన తర్వాత కుటుంబంతో కలిసి జీవనం సాగించడం వల్ల వ్యాధి కుటుంబ సభ్యులకు, ఇతరులకు విస్తరిస్తోంది. అలా సంక్రమించిన వ్యాధుల్లో క్షయ, హెచ్ఐవి రోగాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గత రెండు దశాబ్దాల వరకు ఈ వ్యాధులపై ప్రజల్లో అవగాహన లేకపోవడం, ఇతర కారణాల వల్ల వ్యాధి తొందరగా వ్యాప్తి చెందేది. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రోగిని గుర్తించిన వెంటనే కెల్ల పరీక్షలు, రక్తపరీక్షలు చేసి రోగం ఏ దశలో ఉందో గుర్తించడం జరుగుతోంది. అందుకోసం సాంకేతిక పరీక్షా కేంద్రాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. రోగాన్ని గుర్తించిన తర్వాత నేరుగా డైరెక్టు అబ్జర్వేషన్ ట్రీట్‌మెంట్ ద్వారా మందులు ఇవ్వడం జరుగుతోంది.

జిల్లాలో క్షయ వ్యాధి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించారా?

జిల్లా వ్యాప్తంగా తీర ప్రాంతం, గిరిజన ప్రాంతాల్లో ప్రజల్లో అవగాహన లేని కారణంగా వ్యాధి విజృంభిస్తోంది. అందువల్ల జిల్లా వ్యాప్తంగా 12 క్షయ నివారణ యూనిట్లు ఏర్పాటు చేసి రోగాలను గుర్తించడంతో పాటు వారికి సకాలంలో మందులు సరఫరా చేయడం, వారు తీసుకుంటున్న ఆహారం, ఇతర వ్యవహారంపై ప్రజల్లో అవగాహన కల్పించి ఇతరులకు ఈ వ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రిమ్స్‌తో పాటు సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం, కొత్తూరు, పాలకొండ, రాజాం, పొందూరు, రణస్థలం ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి రోగులకు సేవలు అందిస్తున్నాం. ఎనిమిది చోట్ల సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్లు, ముగ్గురు పర్యవేక్షకులు ఇందులో పనిచేస్తున్నారు. 32 ఆర్‌టిపిసి వర్కర్లను జిల్లాలో ఏర్పాటు చేయడం వల్ల రోగులకు సకాలంలో మందుల పంపిణీకి సాధ్యమవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సమన్వయంతో మందులను క్షేత్రస్థాయిలో అందించడం జరుగుతోంది.

జిల్లాలో ఏరకమైన క్షయవ్యాధి గ్రస్తులు ఎక్కువగా ఉన్నారు.?

జిల్లాలో ఎక్కువగా శ్వాసకోశ క్షయ రోగులే ఎక్కువగా ఉన్నారు. అక్కడక్కడా బోన్ టిబి వ్యాధి లక్షణాలు కనపడుతున్నాయి. అయితే చిన్నతనంలోనే క్షయ వ్యాధి సోకితే ఈ బ్యాక్టీరియా వృద్ధి చెంది రక్తంలో కలిసిపోతుంది. దీనివల్ల బోన్ టిబి లక్షణాలు అప్పుడప్పుడూ బయటపడతాయి. అయితే సకాలంలో మందులు వాడుకుంటే ఆరోగ్యం తిరిగి కుదుటపడుతుంది. ఈ వ్యాధిలో అడ్వాన్సు స్టేజి వరకు మందులు వాడక పోతే రోగం తీవ్రత అధికమై ప్రాణాలను హరిస్తుంది. ప్రధానంగా హెచ్ఐవి సోకిన వారిలో తొందరగా వ్యాధి విస్తరిస్తుంది. అందువల్ల రోగులకు తప్పనిసరిగా కెల్ల పరీక్షలతో పాటు రక్త పరీక్షలు, హెచ్ఐవి పరీక్షలు చేయాల్సి ఉంటుంది.

క్షయ నివారణలో భాగంగా రోగులకు ఏ మేరకు పౌష్టికాహారం అందిస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా ఉన్న 1640 మంది క్షయ రోగులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందులతో పాటు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుంది. ప్రధానంగా ప్రోటీన్ అధికంగా తీసుకోవడం వల్ల వారిలో బలమైన శరీరంతో పాటు వ్యాధి నిరోధకశక్తిని పెంచేందుకు దోహదపడుతుంది. అందుకోసం పాలు, గుడ్లు, వేరుశనగ ఉండలు, నువ్వు ఉండలు, ప్రోటీన్ పౌడరు, హైజనిక్ ఆహారం అందించడం జరుగుతోంది. ప్రతి నెలా దాతల సహకారంతో రూ.700 విలువ చేసే కిట్లు ప్రతి నెలా అందించడం జరుగుతోంది. కొంతమంది తిరిగి ఆరోగ్య వంతులుగా మారడానికి వీలవుతుంది. కానీ హైజనిక్ కిట్లుతో పాటు అందిస్తున్న మందులను క్రమం తప్పకుండా తీసుకుంటే వ్యాధి నుంచి బయటపడేందుకు వీలవుతుంది. మందుల వాడకంలో నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు తప్పదు.

జిల్లాలో ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో వ్యాధి విస్తరణ కొంత మేరకు తగ్గు ముఖం పడుతోంది. 2015 నాటి నుండి 2020 వరకు ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాలతో సర్వే చేసి, వివరాలతో సరిచూసి కేసుల సంఖ్య 20శాతం తగ్గిందని నిర్ధారణకు వచ్చారు. 2015తో 19,478 మందికి టిబి. పరీక్షలు నిర్వహించగా 10శాతం పాజిటివ్ వచ్చాయని, 2015 తర్వాత 41,761 మందికి పరీక్షలు నిర్వహించగా కేవలం 1,226 మందికి అంటే 3శాతం మాత్రమే పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో 1640 కేసులు మాత్రమే నమోదయ్యాయి. కేసుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. క్షయ రోగుల మరణాల రేటు గతం కంటే తగ్గింది.

నువ్వలరేవును నావలరేవుగా మారుస్తా

మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

నువ్వలరేవును నావలరేవుగా మారుస్తానని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఆదివారం ప్రగతి భవన్‌లో నువ్వలరేవు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి అనేక అంశాలపై సుదీర్ఘంగా ఆయన చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తాము సముద్రంలో వేట చేసుకుంటూ జీవనోపాధి సాగించుకుంటు న్నామని, ఏదైతే ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందో అదే స్థానంలో పూర్తి స్థాయి హార్బర్ నిర్మించి ఇవ్వాలని కోరారు. తద్వారా తమ కుటుంబాలు వలసలుపోయి ఇతర ప్రాంతాల్లో వేట చేసుకొని బతకాల్సిన పరిస్థితి ఉండకూడదని, మాకు ఇక్కడే హార్బర్ కట్టించి ఇవ్వడం వల్ల ఇక్కడే జీవనోపాధి దొరుకుతుందని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందచేశారు .దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి గ్రామస్తుల సహకారంతో నువ్వలరేవుని మరింత ఎక్కువగా అభివద్ధి చేస్తామని, తీరప్రాంతంలో మత్స్య వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మత్స్యకారులంటే ఎనలేని ప్రేమని, రాష్ట్రంలో ప్రతి మత్స్యకార కుటుంబానికి సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ఈ ప్రభుత్వం పని చేయడం జరుగుతుందని అన్నారు. మీ విషయాన్ని తక్షణమే సిఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నువ్వలరేవు గ్రామ పెద్దలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అప్పలరాజుకు వినతిపత్రం అందిస్తున్న నువ్వలరేవు గ్రామస్తులు

క్షయ నివారణపై ప్రత్యేక శ్రద్ధ

డిఎంహెచ్ఒ బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్షయ వస్తే భయపడాల్సిన అవసరం లేదని, సక్రమంగా మందులు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులు కావచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నగరంలోని బాపూజీ కళామందిర్‌లో క్షయ వ్యాధిగ్రస్తులకు బలవర్ధకమైన ఆహార సరుకుల కిట్లు, కిడ్నీ బాధితులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. డునాంట్ హెన్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. జిల్లాలో 1640 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉండగా, వారిలో 1200 మందికి బలవర్ధకమైన ఆహారాన్ని అందించే కిట్లను అందించినట్లు తెలిపారు. క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులను తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందన్నారు. మందులు తీసుకునే సమయంలో బలవర్ధకమైన ఆహారం అవసరమని చెప్పారు. అందుకోసమే స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో రోగులకు ఆరు నెలల పాటు ఉచిత మందులతో పాటు బలవర్ధకమైన ఆహారాన్ని రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తుల కోసం దాతల నుండి రూ.50లక్షలు సేకరించినట్లు తెలిపారు. జాతీయస్థాయిలోనే జిల్లాలో ఇటువంటి కార్యక్రమం ప్రారంభం కావడం ఆనందదాయకమన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం 9 ట్రై సైకిళ్లను వైద్యారోగ్యశాఖకు అందించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా క్షయ నివారణాధికారి ఎన్.అనురాధ మాట్లాడుతూ క్షయ రోగులకు ప్రభుత్వం ఉచిత పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేస్తుందన్నారు. రోగులు 168 రోజుల పాటు క్రమం తప్పకుండా మందులు తీసుకుంటే ఆరోగ్యవంతులు కావచ్చన్నారు. ఆరోగ్యంగా ఉన్నామని మందులను మధ్యలో ఆపకూడదని స్పష్టం చేశారు. క్షయ రోగులకు బలవర్ధకమైన ఆహారం అవసరమని, అందుకోసం ప్రభుత్వం ప్రతి నెల రూ.500 అందిస్తున్నట్లు తెలిపారు. వీటికి అదనంగా రూ.700ల విలువ గల హైజనిక్ ఆహారం కిట్లు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం క్షయ రోగులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త పి.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, డిఆర్‌డిఎ ఎఒ పి.దొర, శ్రీకచ్ఛపి కళాక్షేత్రం అధ్యక్షులు బి.దుర్గా శ్రీనివాసశర్మ, ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

మాట్లాడుతున్న దక్షిణామూర్తి

ఫార్మాలో పెరుగుతున్న పని ఒత్తిడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఫార్మారంగంలో పనిచేస్తున్న రిప్రజెంటేటివ్‌లపై యాజమాన్యాలు అనుసరిస్తున్న వైఖరికి పరోక్షంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరే కారణమని, కార్మికులు, ఉద్యోగులు సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ధ్వజమెత్తారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రజలపై అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యోగులు, కార్మికులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు దక్షిణామూర్తి మాట్లాడుతూ సంస్థాగతంలో యూనియన్ మరింత బలోపేతం కావాలన్నారు. పెరుగుతున్న పని ఒత్తిడి ఫార్మారంగంలో ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కంపెనీల మధ్య పోటీ పెరుగుతోందని, ఈ పోటీలో ఉద్యోగులపై పనిభారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా డి.వి.టి.రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.మహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సిహెచ్.రాజేంద్రప్రసాద్, ఎం.శంకరరావు, సంయుక్త కార్యదర్శిగా డి.వాసుదేవరావు, బి.వెంకటరావు, కోశాదికారిగా వై.శ్రీనివాసరావులు ఎన్నికయ్యారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని విశాఖపట్నానికి చెందిన ఎపిఇపిడిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం సకుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామి వారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారి చక్రవర్తి పాల్గొన్నారు.

రూ.5.98 లక్షల ఆదాయం

మాఘమాసం తొలి ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ పెరిగింది. ఒక్క రోజులోనే రూ.5.98 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ విహరి సూర్యప్రకాష్ తెలిపారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,55,900, విరాళాల రూపంలో రూ.91,682లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,50,000 ఆదాయం సమకూరినట్టు వివరించారు.

ధాన్యం అడవి పందులపాలు

లబోదిబోమంటున్న రైతు

మెళియాపుట్టి మండలంలో చాపరకు చెందిన రైతు గేదెల చిరంజీవికి సంబంధించి ధాన్యం అడవి పందులు పాలయ్యాయి. కొన్ని రోజుల క్రితం నూర్చిన ధాన్యం 12 బస్తాలు కల్లంలో ఉంచారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రోజుల తరబడి కల్లంలోనే ధాన్యం ఉంచాడు. శనివారం రాత్రి అడవి పందులు గుంపు కొంత ధాన్యాన్ని తినేసి మిగతావి ధ్వంసం చేశాయి. దీంతో రైతు చిరంజీవి ఆవేదన చెందుతున్నాడు. జీవనాధారంగా ఉండే వరి పంటను సాగు చేసి చివరకు చేతికొచ్చిన పంటను ఇలా అడవిపందుల పాడవ్వడంతో నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన తనకు ప్రభుత్వపరంగా సాయం అందించాలని కోరారు.

అసంపూర్తి నిర్మాణాలు

మూడేళ్లు దాటినా పూర్తి కాని పనులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందాలనే ఉద్దేశంతో అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం సాధ్యపడుతుందని అన్ని రకాల సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని పాలకులు చెబుతున్నారు. సచివాలయ వ్యవస్థలో భాగంగా గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీ, పాల కేంద్రాలు నిర్మాణాలు చేపడతామని ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. వీటి నిర్మాణాల కోసం జాతీయ ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు. ఇప్పటికీ ఒక్క సచివాలయం పరిధిలోనూ అన్ని భవనాల నిర్మాణాలు పూర్తిచేసిన దాఖలాలు లేవు. దీంతో గ్రామ పరిపాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడ ఏ సేవలు అందుతున్నాయో అర్థంకాక గ్రామీణ ప్రజల అవస్థలు పడుతున్నారు.

పలాస నియోజకవర్గంలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో 72 సచివాలయాలను ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ముందుగా పాత పంచాయతీ భవనాల్లో ప్రారంభించారు. సిబ్బంది కూర్చోడానికి, విధులు నిర్వహించడానికి భవనాలు సరిపోకపోవడంతో ప్రభుత్వం కొన్నిచోట్ల నూతన భవనాలను, మరికొన్నిచోట్ల పాత భవనాలపై మరో అంతస్తు నిర్మాణానికి ఉపాధి హామీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. సచివాలయ కాంప్లెక్స్ ఏర్పాటుచేసి అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండాలని నిర్ణయించినప్పటికీ స్థలాభావం వల్ల అనువైన చోట వేరువేరు కార్యాలయాలు ఏర్పాటు చేయుటకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ తంతు జరిగి నేటికీ మూడేళ్లు దాటిన కొన్నిచోట్ల భవనాల పనులు ప్రారంభంకాకపోగా మరికొన్నిచోట్ల అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. వజ్రపుకొత్తూరు మండలంలో 27 సచివాలయాలకు గాను 17 కొత్త భవనాలు మంజూరు కాగా పది పాత భవనాలపై కొత్త అంతస్తు కట్టడానికి నిధులు మంజూరు చేశారు. అయితే ఇప్పటివరకు

పెద్దమురహరిపురంలో అసంపూర్తిగా నిలిచిన ఆర్‌బికె

బాతుపురంలో పునాదులకే పరిమితమైన వెల్‌నెస్ సెంటర్

దేవునల్తాడ, గరుడుభద్ర, మెట్టూరు సచివాలయ భవనాలు నిర్మాణాలు పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. నగరంపల్లి, అమలపాడు వెండి సచివాలయ భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. మండలంలోని 26 రైతు భరోసా కేంద్రాలకు వజ్రపుకొత్తూరు, దేవునల్తాడ, కొత్తపేట, అనంతగిరి, చినవంక, బెండి, ఆర్‌బికెలు పూర్తయ్యాయి. మిగతా భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. హెల్త్, వెల్నెస్ సెంటర్లు పునాదుల్లోనే ఉండగా డిజిటల్ గ్రంథాలయ నిర్మాణాలు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికీ కొన్నిచోట్ల స్థలాలు కొరత వెంటాడుతూనే ఉంది. గోవిందపురంలో ఆర్‌బికె నిర్మాణానికి ప్రభుత్వ భూములు లేక అదే గ్రామానికి చెందిన కొంచడా వెంకటరావు 15 సెంట్ల స్థలం విరాళంగా ఇచ్చిన పరిస్థితి ఉంది. సచివాలయ కార్యకలాపాలను పాత ప్రభుత్వ భవనాలు అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు అసౌకర్యాల మధ్య నిర్వహణతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

భవన నిర్మాణంలో అసంపూర్తిగా నిలిచిపోవడానికి బిల్లులు సకాలంలో కాకపోవడమే ప్రధాన కారణమని తెలుస్తుంది. పెండింగ్ బిల్లు చెల్లిస్తే గాని పనులు చేపట్టలేమని కాంట్రాక్టర్లు అధికారులు, నాయకులకు చెప్పినట్లు సమాచారం. ఆయా గ్రామాల అధికార పార్టీ నాయకులు, సర్పంచులే పనులు చేపట్టాలని పైనుంచి ఒత్తులు వస్తున్నప్పటికీ బిల్లు కావనే ఉద్దేశంతో ఎవరూ ముందుకు రాని పరిస్థితులు నెలకొన్నాయి.

పని జరిగిన మేరకు బిల్లులు చెల్లిస్తున్నాం

వజ్రపుకొత్తూరు మండలంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద 27 సచివాలయ భవనాలు, 26 రైతు భరోసా కేంద్రాలు, 23 వెల్నెస్ కేంద్రాలు, ఏడు డిజిటల్ లైబ్రరీలు నిర్మాణం కోసం రూ.23 కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నాం. ఇప్పటివరకు వివిధ దశల్లో రూ.8 కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించాం. మిగిలిన పనులను పూర్తిగా చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము.

- నాగభూషణం,
మండల ఇంజినీరింగ్ అధికారి

శ్రమదానంతో చెరువు పరిశుభ్రం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని ఉప్పల, పప్పల, కొండీ వీధికి చెందిన యువత శ్రమదానంతో సయ్యద్‌ఖాన్ చెరువును ఆదివారం పరిశుభ్రం చేశారు. ఎంతో కాలంగా చెరువు నిండా పూడికలు, పిచ్చి మొక్కలతో నిండింది. ఏడు వీధుల ప్రజలు నిత్యం ఈ చెరువును వినియోగిస్తుంటారు. పాలకులు ఈ చెరువును పట్టించుకోకపోవడంతో బర్ల లక్ష్మణరెడ్డి ఆధ్వర్యాన ఢిల్లేశ్వరరావు, నందిక సోమేష్, నవి. బెన బాలు, తదితరులు ముందుకొచ్చారు. చేయి చేయి కలిపి శ్రమదానం చేశారు. పూడిక తీత పనులు చెప్పట్టారు. ఇదే చెరువును సుందరీకరణ చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని గతంలో అనేక ప్రయత్నాలు పాలక వర్గం చేసింది. ప్రతిపాదనలకు పరిమితి కావడంతో సయ్యద్ ఖాన్ చెరువు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో మూడు వీదు ప్రజలు ముందుకొచ్చి శ్రమదానం చేయడం సర్వత్రా అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

సయ్యద్ ఖాన్ చెరువును శుభ్రం చేస్తున్న యువత

ఘనంగా ఎస్‌విజె వార్షికోత్సవం

కవిటి: స్థానిక ఎస్‌విజె విద్యా సంస్థ ఇంటర్, డిగ్రీ కళాశాలల వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బివివి ప్రసాదరావు, ఎస్‌విజె హైస్కూల్ హెచ్‌ఎం బి.జగ్గారావు, కళాశాలల ప్రిన్సిపాల్స్ పి.సత్యనారాయణ, సిహెచ్ జోష్ కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ ఎం.భాస్కరరావు, ఆర్.మహేష్, జి.జగన్నాయకులు, ఎస్‌విజె సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డాన్స్ చేస్తున్న విద్యార్థులు

కాటమ్మ తల్లి ఆలయాన్ని పరిశీలిస్తున్న సిఐ శ్రీనివాసరావు

రెండు ఆలయాల్లో చోరీ

10 గ్రాముల బంగారం, ఐదు కేజీల వెండి అపహరణ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లా కాటమ్మ తల్లి, వీరబ్రహ్మం ఆలయాల్లో ఆదివారం వేకువజామున దొంగలు పడ్డారు. ఆలయాల్లోని బంగారం, వెండి వస్తువులను అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం... కాశీబుగ్గలోని వంద మీటర్ల దూరంలో కాటమ్మ తల్లి ఆలయం, వీరబ్రహ్మం ఆలయాలు ఉన్నాయి. రోజూ మాదిరిగానే ఆలయాల తలుపులను పూజారులు జన్ని వెంకటరావు, బూరగాపు వైకుంఠరావు తెరిచేందుకు ఉదయం వెళ్లారు. ఆలయ తాళాలు బద్దలు కొట్టి ఉండటాన్ని గుర్తించి, పోలీసులకు వేర్వేరుగా సమాచారం అందించారు. కాటమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ముఖం, పళ్లెం, కిరీటం, సుమారు 5కేజీల వెండి వస్తువులు, వీరబ్రహ్మం ఆలయంలో బ్రహ్మంగారి బంగారపు కళ్లు, వెండి వస్తువులను దుండగులు అపహరించారు. రెండు ఆలయాల్లో ఉన్న హుండీలు పగలగొట్టి అందులో ఉన్న సొమ్మును దోచుకున్నారు. అనంతరం స్టీల్ హుండీలను ఆలయం సమీపంలో ఉన్న పంట పొలాల్లో విడిచిపెట్టి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, జిల్లా క్లూస్ విభాగం సిఐ జివి రమణ ఘటనా స్థలానికి చేరుకొని చోరీ ఎలా జరిగిందో పరిశీలించారు. అప్పటికే ఆలయాల్లో ఉన్న సిసి కెమెరా పుటేజీని దుండగులు అప్పహరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాశీబుగ్గ సిఐ తెలిపారు.

పరామర్శిస్తున్న గౌతు శిరీష

గౌతు శిరీష పరామర్శ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని బెండి పంచాయతీ మహదేవిపురం గ్రామానికి చెందిన మెట్ట వాసుదేవరావు, గూన బృందావనం, శిష్టు సారథినాయుడు పొలంలో అమ్మకానికి ఉంచిన ధాన్యం అగ్నిప్రమాదంలో కాలిపోయిన విషయం తెలిసిందే. ఆదివారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష బాధిత రైతు కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు, బాధితుల వద్ద నుండి పోలీసులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు వెలికి తీయాలని కోరారు. పోలీసులు సానుకూలంగా స్పందించారని, త్వరలో బాధితులకు న్యాయం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆమెతో పాటు టిడిపి మండల అధ్యక్షులు మోహనరావు, శశి, దుర్యోధన, మెట్ట రమణ, ఉమామహేశ్వరరావు, దాసరి జేజేరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సురేష్

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని కొరసవాడలో శ్రీకాకుళంలో ఉన్న సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ 500 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిపి, సుగర్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సతీష్, ఆర్‌ఎంపి వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునిగా మోహనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మోహనరావు

ఎల్ఎన్‌పేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా మెండ మోహనరావును నియమిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పార్టీ అధ్యక్షునిగా ఉన్న వెలమల గోవిందరావు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అన్నారు. పార్టీకి నష్టపరుస్తున్న కారణంగా ఆయనను తొలగించినట్టు పేర్కొన్నారు. పార్టీని మండల స్థాయిలో పటిష్టపరచడానికి కృషి చేయాలని నూతన అధ్యక్షునికి సూచించారు.

అప్పలనాయుడు పరామర్శ

లావేరు: మండలంలోని లుకాలాపుపేటకు చెందిన యందువ చిరంజీవి అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకులు లుకాలాపు అప్పలనాయుడు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అలాగే ఇజ్జడపాలెంకు చెందిన గొర్లె సత్యం ఇటీవల అగ్ని ప్రమాదంలో గాయపడ్డాడు. ఆయన ఇంటికే వెళ్లి పరామర్శించారు. అప్పలనాయుడు వెంట మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, కొత్తకోట మాజీ సర్పంచ్ శివంగం నాగరాజు, బూత్ కన్వీనర్ మీసాల నారాయణరావు, యాందవ శ్రీనివాసరావు, వైసిపి సోషల్ మీడియా వారియర్ పతివాడ గురునాయుడు, గొర్లె సూర్యనారాయణ, సత్యం, గురునాయుడు ఉన్నారు.

పరామర్శిస్తున్న అప్పలనాయుడు

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉద్దాన ప్రాంత విద్యాభివద్ధి వేదిక ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష, విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దాన విద్యా అభివద్ధి వేదిక అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యా సదస్సులో ప్రధాన వక్తలుగా రాంబుడ్డి గణపతి, పుక్కల్ల చిరంజీవి, డాక్టర్ టి.బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతిభా పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మేధాశక్తి పెరుగుతుందన్నారు. ప్రతిభా పరీక్షకు ఉద్దాన ప్రాంతంలో ఉన్న 12 పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభా పరీక్షలో మొదటి కొండప్ప ఇందు, గోరకల గణేష్, పసుపురెడ్డి సాత్విక్ వరుస మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో సర్పంచ్ తామాడ మదన్, బొడ్డు చిన్నారావు, కుత్తుం ప్రకాష్‌రావు, బత్తిని ఓంకార్, రెయ్యి కృష్ణారావు, పి.బాలరాజు, బొడ్డు సుధాకర్, ఎంపల్ల కామేశ్వరరావు, తెప్పల వాసుదేవరావు, తంగుడు ఖగేశ్వరరావు, బుడత ఢిల్లేశ్వరరావు, కుత్తుం వినోద్, బొమ్మాళి శివ, తెలుకుల గణేష్ , కాళ్ల లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో రాంబుడ్డి గణపతి, యువివి ప్రతినిధులు

ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

విజేతలతో శ్రీనివాసులునాయుడు

ప్రజాశక్తి- జలుమూరు

కరవంజ ఆదర్శ పాఠశాలలో దేసూల విజయగౌరి జ్ఞాపకార్థం పిఆర్‌టియు జలుమూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష విజయవంతంగా ముగిసింది. మండలంలోని 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు సారవకోట మండలంలోని బుడితి, నరసన్నపేట మండలంలోని కంబకాయ పాఠశాలలకు చెందిన 166 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో కరబంజ ఆదర్శ పాఠశాలకు చెందిన రావాడ హేమశిరీష, సవలాపురం చరణ్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. యలమంచిలి ఉన్నత పాఠశాలకు చెందిన చెంచల ప్రవీణ్ తృతీయ బహుమతి గెలుచుకున్నాడు. వీరికి మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర గౌరవాధ్యక్షులు బైరి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, సర్పంచ్ జుత్తు నేతాజీ, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పలాస : ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందిస్తున్న దాసరి రాజు

స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పలాస

పలాసకు చెందిన ప్రసాద్ మహారణ మృతి చెందాడు. 2004-05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.5వేలు ఆర్థిక సాయంతో పాటు, నెలకు సరిపడ నిత్యావసర సరుకులు ప్రసాద్ కుటుంబానికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కొవ్వూరు రాజేష్, లండ పాపారావు, రట్టి మనోజ్‌కుమార్, నెయ్యిల శివకుమార్, మార్పు. శ్యామలరావు, సనపాల హరి, సుడీయ అవినాష్, కిషోర్, ప్రసాద్, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ నాయకులు..

ఇచ్ఛాపురం: జనసేన కార్యకర్త బుడ్డేపు వెంకటేష్ ఇటీవల మృతిచెందాడు. మృతుని కుటుంబానికి జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు మృతుని కుటుంబానికి ఆదివారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన మాట్లాడుతూ మీ కుటుంబానికి అన్ని విధాలుగా పార్టీ తరపున అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తిప్పన సురేష్, ఆర్.భాస్కర్, డి.దివాకర్, రామకృష్ణ, హేమా చలపతి, చింటు పాల్గొన్నారు.

విలువలతో కూడిన జర్నలిజంతో మెరుగైన సమాజం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విలువలతో కూడిన జర్నలిజంతో మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమతుందని టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి అన్నారు. టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు అధ్యక్షతన ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐ మాట్లాడుతూ సమాజంలో పత్రికలకు, టివి ఛానెళ్లకు ఒక ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉన్నాయని అన్నారు. అయితే వాస్తవాలను సమాజంలోకి తీసుకువెళ్లే బాధ్యత మీడియాపై ఉందన్నారు. ప్రజా సమస్యలు పత్రికల ద్వారా పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు సుదర్శనరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పేడాడ పరమేశ్వరరావు, కర్రి శంకరరెడ్డి, పి.ఎ.పంతులు, గినియా శ్రీనివాసరావు, వట్టికోల కార్తిక్‌కుమార్, సుంకు గోపినాథ్, పొట్నూరు వినాయకరావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సిఐ, తదితరులు

1న మండల స్థాయి యోగా పోటీలు

పోలాకి: స్థానిక ప్రజా గ్రంథాలయంలో ఫిబ్రవరి 1న మండల స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రజా గ్రంథాలయం వ్యవస్థాపకులు తాడి యర్రయ్య తెలిపారు. ఆదివారం గ్రంథాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 1న శ్రీ తాడి దాలెమ్మ, యర్రయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా పోటీల్లో పాల్గొనే వారు 31వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్ నెంబరు 9346707343కు ఫోన్ చేసి, పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేయిబడునని తెలిపారు. ఆసక్తి కలవారు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆదివారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వేణుగోపాలరావు ఆధ్వర్యాన ఆదివారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ద్విచక్ర వాహనలకు సంబంధించిన పత్రాలు లేని వారి నుంచి అపరాధ విధించారు. అలాగే హెల్మెట్ ధరించని వారికి, ముగ్గురితో ప్రయాణం, మద్యం తాగి వాహనం నడిపి వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, నిదానంగా వెళ్లి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. తరచూ వాహనాలను తనిఖీ చేస్తామని అన్నారు. అందుకు వాహనదారులందరూ తప్పనిసరిగా సంబంధిత పత్రాలను ఉంచుకోవాలన్నారు. హెల్మెంట్ ధరించకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పెద్ద వాహనాలను ఓవర్‌టేక్ చేసిన సమయంలో ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీలో ఎస్‌ఐ ఎం.గోవింద, సిబ్బంది ఉన్నారు.

వాహనదారులతో మాట్లాడుతున్న సిఐ వేణుగోపాలరావు

క్షణ క్షణం... భయం భయం

- ఏ క్షణంలోనైనా కూలేందుకు సిద్ధం
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం

బ్రిటీష్ కాలం నాటి ప్రభుత్వ భవనం... ఎన్నో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆ భవనం పూర్తిగా శిథిలమైంది. ఎప్పుడు ఏది పైనుంచి పడిపోతుందోనంటూ బిక్కుబిక్కుమని భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారు మండల పరిషత్ కార్యాలయం ఉద్యోగులు.

ప్రజాశక్తి - పొందూరు

పొందూరు మండల పరిషత్ కార్యాలయం భవనం ఎన్నో దశాబ్దాల క్రితం బ్రిటీష్ వారి హయాంలో నిర్మించారు. ప్రస్తుతం ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయం పైకప్పులు పలు చోట్ల పడిపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ కార్యాలయం సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనంటూ కార్యాలయం సిబ్బంది తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా కారిపోతుండడంతో కంప్యూటర్లు, దస్త్రాలు తడిసిపోకుండా ఉండేందుకు సిబ్బంది నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకుంది.

వినియోగానికి దూరంగా నూతన భవనం

గత టిడిపి ప్రభుత్వ హయంలో అప్పటి ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రజలకు నాణ్యమైన సేవలు, వసతులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అనువుగా మండల పరిషత్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సుమారు రూ.1.20 కోట్లతో అధునాతనమైన వసతులతో భవనాన్ని నిర్మించారు. ఈ భవన నిర్మాణం దాదాపు పూర్తయి మూడేళ్లు అవుతున్నా నేటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో పలుశాఖల అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనం నిర్మాణం చేపట్టిన గుత్తేదారుకు సుమారు రూ.13 లక్షలు బిల్లు పెండింగ్ ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఇంకా పెండింగ్‌లో ఉన్న బిల్లును చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ ఆ భవనాన్ని అప్పగించలేదు. ఇప్పటికైనా అధికార ప్రభుత్వం స్పందించి మండల పరిషత్ నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలంటూ ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపిడిఒ సీపాన హరిహరరావును వివరణ కోరగా, కాంట్రాక్టర్‌కి పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో అప్పగించలేదు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి భవనం ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.


శిథిలావస్థలో ఉన్న ఎంపిడిఒ కార్యాలయం

పడిపోయిన భవనం పైకప్ప

వినియోగంలోకి రాని నూతన భవనం